క్లుప్తంగా

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



గిరిజన విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో చంద్రకళ

మిర్యాలగూడ : విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీడీపీఓ ఎస్.చంద్రకళ అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు రుతుక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత నుంచి దూరంగా ఉంటారని, ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గుడ్ యూనివర్స్ ఎన్‌జీఓ తబస్సుమ్, ఎంఈఓ బాలాజీనాయక్, పీహెచ్‌సీ వైద్యుడు నసీమాబేగం, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాల్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణలో ఉత్తమ ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న శీతల్

గుర్రంపోడు: జాతీయ నూతన విద్యావిధానంపై ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి రీసోర్స్‌పర్సన్‌ల శిక్షణ కార్యక్రమంలో గుర్రంపోడు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సోషల్ ఉపాధ్యాయురాలు విటలాని శీతల్ పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యలో సాంకేతికత, ఇంటరాక్టివ్, ఉపకరణాల వినియోగం, సైబర్ నేరాల వలలో పడకుండా విద్యార్థులను రక్షించడం, వర్చువల్ రియాల్టీ, 21వ శతాబ్దంలో నైపుణ్యాలు సాధించడం వంటి అంశాలపై నిర్వహించిన శిక్షణలో శీతల్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శీతల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు అభినందించారు.

కాంగ్రెస్ మహిళా రాష్ట్ర కార్యదర్శిగా జాను

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన షేక్ జాను కాంగ్రెస్ మహిళా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాంబల ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ జాను మాట్లాడారు. తెలంగాణలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తానన్నారు.

ఇండియన్ ఒలింపిక్స్‌లో విద్యార్థినుల ప్రతిభ

నాగార్జునసాగర్ : నెట్‌బాల్ నేషనల్ గేమ్స్ (ఇండియన్ ఒలింపిక్స్)లో నాగార్జునసాగర్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఉత్తరాఖండ్‌లో ఈ నెల 3నుంచి 16వతేదీ వరకు నెట్‌బాల్ 38వ నేషనల్ గేమ్స్ (ఇండియన్ ఒలింపిక్స్) జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన ఋషవిరాజ్, రిజ్వానాలు రాష్ట్రం తరపున పాల్గొని సిల్వర్‌మెడల్స్ సాధించారు.ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

దేవరకొండ: దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బందికి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై తడి పొడి చెత్తను వేరు చేయడం, సిటిజన్ ఫీడ్ బ్యాక్, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రునాయక్, మేనేజర్ అరిఫుద్దీన్, రాకేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

హాలియా : అనుముల మండలంలోని నాయుడుపాలెం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శివకోటి వీర్రాజు తండ్రి శివకోటి జగ్గారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం నాయుడుపాలెం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శివకోటి జగ్గారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ హజారిగూడెం మాజీ ఉపసర్పంచ్ సీనియర్ నాయకులు పున్నయ్య, చేగొండి కృష్ణ, మన్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు

- పీకే మల్లేపల్లిలో మూడు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు
- మరోవైపు మక్కా మహేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు
- హాజరుకానున్న ప్రముఖులు



దర్గాలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

చింతపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో జాన్‌పహాడ్‌గా పేరుగాంచిన చింతపల్లి మండలం పీకే మల్లేపల్లిలోని హజ్రత్ అబ్బాస్ దర్గా 56వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 23 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు దర్గా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశం, ఖమ్మం, వరంగల్, మెదక్ జిల్లాల నుంచి భక్తులు తరలి రానున్నారు. ఇక్కడ గుట్ట కిందభాగంలో హజ్రత్ అబ్బాస్ దర్గా.. పైభాగంలో మక్కా మహేశ్వరస్వామి ఆలయం ఉంటుంది. దీంతో ఇక్కడ ఒకేసారి ఒకవైపు మహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మరోవైపు దర్గాలో ఉర్సు జరగడం ఇక్కడి ప్రత్యేకత. గుట్టకింద దర్గా ఉర్సు, గుట్టపైన మహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఒకేసారి నిర్వహిస్తుండడంతో కొన్నేళ్ల నుంచి పీకే మల్లేపల్లి గ్రామం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఉత్సవాలు ఇలా..

ఈ నెల 21 శుక్రవారం రాత్రి 11గంటల నుంచి దర్గా ముతావలీ మహ్మద్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో భక్తజన సందోహం మధ్య ఒంటెపై గంధం (సందల్) ఊరేగింపుగా వచ్చి తెల్లవారుజామున 5గంటలకు స్వామి వారికి సమర్పిస్తారు. 22న అన్నదానం నిర్వహిస్తారు. గుట్టపై మక్కా మహేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారు. 23న దీపారాధనలు, కందూర్లు, మొక్కుబడులు చెల్లిస్తారు. గుట్ట కింద ఉర్సు, గుట్టపైన శివపార్వతుల కల్యాణం ఒకేసారి జరుగుతుండడంతో పీకే మల్లేపల్లి గ్రామంతా పండుగా వాతావరణం నెలకొంటోంది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు చింతపల్లి మండలం మాల్, కుర్మేడు, కురంపల్లి, సాయిరెడ్డిగూడెం, మోదుగుల, మల్లేపల్లి మీదుగా పీకే మల్లేపల్లికి బస్సుల సౌకర్యం ఉంటుంది. ఉర్సు సందర్భంగా అన్ని రూట్లలో బస్సులను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ మంత్రికుందూరు జానారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు ప్రముఖులు హాజరుకానున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎన్నెస్పీ ఆవరణలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌లో దోమల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె త్రిపురారంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించారు. హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. మీకు ఇష్టమైన సబ్జెక్టు ఏంటి అని విద్యార్థులకు అడిగి బయాలజీలో కొన్ని పాఠాలు బోధించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి తహసీల్దార్ గాజుల ప్రమీలకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఆర్‌ఐలు సైదులు, సంతోష, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హిందీ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం : కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గంట ఆధారిత పద్ధతి(హెచ్‌బీటీ)లో హిందీ(టీజీటీ) బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ ఉపాధ్యాయుడి నియామకం పూర్తిగా తాత్కాలికమైందని, ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 24వ తేదీన డెమో క్లాస్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

- అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ: అసంపూర్తిగా ఉన్న చందంపేట గ్రంథాలయ భవనాన్ని పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల మంజూరుకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులకు ప్రతిపాదనలు పంపించాలని అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రత్యేక అధికారి జె. శ్రీనివాస్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధ్యక్షతన ఆయన చాంబర్‌లో నల్లగొండ జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరంలో గ్రంథాలయ సంస్థ ద్వారా చేసిన ఖర్చు, రాబడులు, లైబ్రరీ సెస్, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్తా పత్రికలకు సంబంధించి రిజిస్టర్, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఆడిటింగ్ చేయించాలని సూచించారు. జిల్లా లైబ్రరీలో వాచ్‌మెన్ నియామకానికి సంచాలకుల అనుమతి కోసం సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమణి, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, వయోజన విద్యాశాఖ పీఓ మమత, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిహారిక

పెద్దవూర : మండలంలోని పులిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గుండాల నిహారిక రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం సుదర్శన్ గురువారం తెలిపారు. నాగార్జునసాగర్‌లో నిర్వహించిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. వికారాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని నిహారిక, పీడీ మురళీని అభినందించారు.

చెప్పులు వేసుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చెప్పులు వేసుకోకుండా ప్రచారం చేస్తున్న వివేకానందస్వామి

మిర్యాలగూడ: ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బి. వివేకానందస్వామి చెప్పులు వేసుకోకుండా టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీజేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. గురువారం ఆయన మిర్యాలగూడలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. 25 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా ఉన్న భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతుల కోసం హర్షవర్ధన్‌రెడ్డి కృషిచేశారని, అందుకు కృతజ్ఞతగా తాను 20 రోజులుగా చెప్పులు వేసుకోకుండా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే సెప్టెంబర్ 1 నాటికి సీపీఎస్ రద్దు చేయిస్తానని అన్నారు. సమావేశంలో పీఆర్‌టీయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రుషికేష్, రామచందర్‌రావు, మధుకర్, గాదె లింగస్వామి, మధు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపడం నేరం



పెద్దవూరలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

పెద్దవూర : మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ వీరబాబు అన్నారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై పోలీసు కళాజాతా ఆధ్వర్యంలో అవగాహన కల్పించి మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న మేజర్లు మాత్రమే వాహనాలు నడపాలని అన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రూల్స్‌కు విరుద్ధంగా అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కళాజాత బృందం తమ ఆట పాటల ద్వారా ట్రాఫిక్ రూల్స్ పాటించడం, సైబర్ నేరాల నియంత్రణ, తదితర అంశాలపై వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాములు, కళాజాత బృందం సభ్యులు కేఎం రాజు, మురళీ, చంద్రశేఖర్, సత్యం, శివరాం తదితరులు పాల్గొన్నారు.

పూల రవీందర్ గెలవాలని పూజలు

మిర్యాలగూడ టౌన్ : త్వరలో జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపొందాలని గురువారం సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి లింగమంతుల స్వామికి బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో జరిగే రెండు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆయన వెంట దాసరాజు రవి, బి.ఉపేందర్, తిరుమలగిరి ప్రసాద్, సతీష్ తదితరులున్నారు.

శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి (ఎన్ఎస్‌ఆర్) ఆశయ సాధనకు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎన్ఎస్‌ఆర్ 6వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్ఎస్‌ఆర్ నిత్యం పీడిత ప్రజల కోసం పనిచేశారని, సంపన్న వర్గంలో పుట్టి పేద ప్రజల కోసం ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో ఉద్యమాలు చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పోలెబోయిన వరలక్ష్మి, వినోద్‌నాయక్, గాదె పద్మ, బావండ్ల పాండు, తిరుపతి, రామ్మూర్తి, కోటిరెడ్డి, ఊర్మిల, అరుణ, గోవర్ధని, లక్ష్మీనారాయణ, రామచంద్రు, మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం పీఏసీఎస్‌లో యూరియా కొరత



త్రిపురారం పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం బారులుదీరిన రైతులు

త్రిపురారం : మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్)కేంద్రంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. గురువారం త్రిపురారం పీఏసీఎస్ కేంద్రానికి యూరియా వచ్చిందని రైతులకు తెలియడంతో ఉదయం నుంచే మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి రైతులు వచ్చి బారులు కట్టారు. అయినా ముందు వచ్చిన కొందరు రైతులకు యూరియా అందింది. దీంతో రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మండలంలో మూడు పీఏసీఎస్ కేంద్రాలతోపాటుగా మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపులు, గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులు ఉన్నప్పటికీ యూరియా కొరత ఎందుకు వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులందరికీ యూరియా అందే విధంగా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై త్రిపురారం పీఏసీఎస్ సీఈఓ నర్సయ్యను వివరణ కోరగా.. యూరియా సకాలంలో వస్తుందని, రైతులందరికీ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన ఎద్దుల పందేలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని నాయకునితండాలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు ముగిశాయి. ఈ పోటీలలో మొత్తం ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సహస్రయాదవ్ ఎద్దులు(రూ.30వేలు), ద్వితీయ బహుమతిని ప్రకాశం జిల్లా మర్రివేముల గ్రామానికి చెందిన సిద్ధి మల్లీశ్వరి ఎద్దులు(రూ.25వేలు), పల్నాడు జిల్లా రెంటచింతల గ్రామానికి చెందిన సూర్య అశ్విత్‌ఈశ్వర్ ప్రణయ్ ఎద్దులు తృతీయ బహుమతి(రూ.20వేలు) గెలుచుకున్నాయి. నిర్వాహకులు విజేతలకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేరావత్ మునినాయక్, మేరావత్ బిచ్చాలు, మోతీలాల్, ప్రభుదాస్, బాల, భానుచందర్, భాను, నాగేందర్, హరి, రమేష్, నర్సింహ, రంగప్రభ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీ ఐక్యవేదిక (లైవ్) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామునాయక్

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలంలోని కొండ్రపోలు గ్రామానికి చెందిన సామాజిక వేత్త ధరావత్ రామునాయక్ లంబాడీ ఐక్యవేదిక (లైవ్) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎన్నికయ్యారు. గురువారం స్థానికంగా జరిగిన లంబాడీ ఐక్యవేదిక(లైవ్) సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామునాయక్ మాట్లాడారు. లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. లంబాడీలకు అందుబాటులో ఉండి హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు

డిండి: మహా శివరాత్రిని పురస్కరించుకొని శివ మాలలు ధరించిన భక్తులు గురువారం డిండి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం తమ మొక్కులు చెల్లించేందుకు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పున్న లింగమయ్య, జంగయ్య, లక్ష్మారెడ్డి, పాండయ్య, సైదులు, సతీష్‌రెడ్డి, పర్వతాలు, శ్రీశైలం, సాయిబాబా, క్రాంతి, పృథ్వీ, దొంతినేని వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, గడ్డమీది సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన



విద్యార్థుల అంతర్గత మార్కులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురారం : మండలంలోని చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల అంతర్గత మార్కులను జిల్లా స్థాయి మార్కుల పరిశీలన బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాసిన తీరు, నోట్ పుస్తకాలు, వేసిన మార్కులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మార్కుల పరిశీలన బృందం సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు వీరయ్య, ఉపాధ్యాయులు నాగయ్య, అంజయ్య, విజయ భాస్కర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, సైదయ్య, లక్ష్మి, మాలోతు దశరథ నాయక్, శ్రీనివాస్, విజయ లక్ష్మి, ఝాన్సీ, నరేందర్, లలిత పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణం సాగర్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను మార్కుల పరిశీలన బృందం సభ్యులు పరిశీలించారు. విద్యార్థులకు మార్కుల కేటాయింపు ఎలా జరిగింది అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

చందంపేట: చందంపేట మండలం పెద్దమూల గ్రామానికి చెందిన లింగాల శంకర్ మంగళవారం చిత్రియాల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. చిత్రియాల సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శంకర్ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం బాధితుడు చందంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పనిచేసే వారిని ఎన్నికల్లో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

మిర్యాలగూడ : పార్టీలను చూసి కాకుండా పనిచేసే వారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని పీఆర్టీయూ అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఉపాధ్యాయులను ఆయన కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో 30శాతం పీఆర్‌సీ సాధించామని, 61సంవత్సరాల వయస్సు పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పీఆర్‌సీ వర్తింపు, కేజీబీవీ ఉపాధ్యాయులకు 6నెలల వేతనంతో కూడిన సెలవులు, బదిలీలు, పదోన్నతులు సాధించి చూపామన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే 6నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అదే విధంగా పీఆర్‌టీయూ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు నెలల తరబడి బెనిఫిట్స్ కోసం వేచి చూడాల్సి వస్తుందని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయించే సత్తా పీఆర్‌టీయూకే ఉందన్నారు. 25 సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డినే గెలిపించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి జాన్‌రెడ్డి, లింగంగౌడ్, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, తిరుపతినాయక్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

దేవరకొండ : పట్టణంలోని మునగాల కొండల్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ కార్తికేయ సెక్యూరిటీ సర్వీస్(టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ కంపెనీ కొంగరకలాన్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఇంటర్వ్యూలకు దాదాపు 100 మంది విద్యార్థులు హాజరుకాగా 40 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రమావత్ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వృధు, శివకృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ

కొండమల్లేపల్లి : ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్(2024–25)లో 7వ తరగతి ఐఐటీ విభాగానికి చెందిన ఎం.అర్జున్ రాష్ట్ర స్థాయి విభాగంలో మొదటి స్థానం సాధించాడు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనగా శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, కొండమల్లేపల్లి బ్రాంచ్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



భక్తాంజనేయ స్వామి ఆలయంలో జలాధివాసం నిర్వహిస్తున్న ఆంజనేయ స్వామి భక్తులు

హాలియా : పట్టణంలోని స్వయంభూ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మశ్రీ నంది వెలుగు శ్రీబాలాజీ గురుకల్, త్రిశతాధిక ప్రతిష్ఠాచార్యుల బృందం ఆధ్వర్యంలో గురువారం వేదపారాయణం, యంత్రానుష్ఠానం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, నిత్యవిధులు, సోమనాథపూజ, యోగీ యాగేశ్వర పూజ, ద్వితీయకాల యాగశాలార్చన, నిత్య హోమం, ప్రతిష్ఠమూర్తులకు లక్షోద్ధారణం, అష్టమృత్తికా స్నపనం, నేత్రోన్మీలనము, దశమహాదర్శనం, జలాధివాసం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేడిపల్లి మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి, పేలపూడి బాలకృష్ణ, ఆలయ కమిటీ కార్యదర్శి వర్కాల సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, గోనీ రాజా రమేష్ యాదవ్, చిన నారాయణ, రామాంజిరెడ్డి, చెన్ను వెంకటనారాయణరెడ్డి, వడ్డె సతీష్‌రెడ్డి, నెర్మటి వెంకట్‌రెడ్డి, వీరమల్ల శ్రీనివాస్, వీరమల్ల కృష్ణయ్య, కొమ్మనబోయిన చంద్రశేఖర్, సముద్రాల దామోదర్, బందిలి పెద సైదులు, మిట్టపల్లి శ్రీనివాస్, రామకృష్ణ, పూజారులు రమణాచార్యులు, వెంకటాచార్యులు, గోవర్ధనా రాఘవాచార్యులు, బీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని కోదండాపురం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఎదుర్కోళ్లు నిర్వహించారు. అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 750 మంది దంపతులు పాల్గొన్నారు. పూజారుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం వైభవంగా సాగింది. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, కట్న కానుకలను సమర్పించుకున్నారు. మధ్యాహ్నం హోమం, బలిహరణం, రాత్రి గరుడ సేవ, పలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ పూజారి శ్రీ కోమండూరి శ్రీనివాసచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణాచారి, సైదిరెడ్డి, ఇందిరామహేందర్, భిక్షమయ్య, వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం

వేములపల్లి(మాడ్గులపల్లి) : గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మాడ్గులపల్లి మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామంలో ఎంప్లాయిస్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన పేదలకు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో డీపీఎం అరుణ్‌కుమార్, ఏపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చందంపేట: పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. చందంపేట మండలం నల్లమూల గ్రామానికి చెందిన లింగాల జనార్దన్(22) బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించగా గురువారం మృతిచెందాడు. జనార్దన్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

మూడు తులాల బంగారం చోరీ

చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన గుండె యాదయ్య గురువారం వ్యవసాయ పనికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మూడు తులాల బంగారం అపహరించారు. ఇంటికి తిరిగి వచ్చే చూసేసరికి తలుపులు తెరిచి ఉండడంతో చోరి జరిగినట్లు గుర్తించినట్లు గుండె యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.